క్లుప్తంగా

'ఎస్సీ వర్గీకరణను అడ్డుకుందాం'

నర్సాపూర్(జి):మాలలందరం ఐక్యమై..ఎస్సీ వర్గీకరణను అడ్డుకుందామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ వెంకటస్వామి అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ సంఘ భవనంలో ఆదివారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సమావేశం నిర్వహించారు. అనంతరం నర్సాపూర్ (జి) ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ బొడ్డు లక్ష్మణ్, ఎర్రోళ్ల పురుషోత్తం, కొంతం వసంత్, గుండోజి దత్తురాం, కమలాకర్, గజ్జారాం, ప్రకాశ్, సాయన్న, ఎల్లన్న తదితరులు న్నారు.

లైబ్రరీకి స్టడీ చైర్లు అందజేత



స్టడీ చైర్లు అందిస్తున్న ఉపాధ్యాయులు

ఖానాపూర్: పట్టణంలోని గ్రంథాలయానికి ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన తొమ్మిది మంది ఉపాధ్యాయులు 20 స్టడీ చైర్లను లైబ్రరీకి విరాళంగా అందించారు. ఇక్కడ చదివి ఉద్యోగాలు సాధించిన వారు తమ మొదటి నెల జీతం నుంచి రూ.20 వేల విలువైన స్టడీ చైర్లు అందజేసినట్లు లైబ్రేరియన్ పృథ్వీరాజ్ తెలిపారు. చైర్లు అందించిన వారిలో షెట్పల్లి సాయి, డి.సాయికృష్ణ, లావణ్య, నవీన్, సుజాత, తిరుమలేశ్, వినయ్ ఉన్నారు.

ప్రణాళికతో చదవడాన్ని అలవాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్సై రమేశ్

తానూరు: విద్యార్థులు ప్రణాళికతో చదవడాన్ని అలవాటు చేసుకోవాలని ఎస్సై రమేశ్ సూచించారు. ఆదివారం మండలంలోని బీసీవసతి గృహంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించగా.. ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ సన్మార్గంలో నడవాలన్నారు. విద్యార్థులంటే భయపడొద్దని భైంసాకు చెందిన వ్యక్తిత్వ వికాస నిపుణులు వాడేకర్ లక్ష్మణ్ సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ సమద్, ఉపాధ్యాయులు గంగాధర్, ధోని తదితరులు ఉన్నారు.

అబుల్ కలాంకు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

కడెం: మండలంలోని లింగాపూర్‌లో ఆదివారం తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహమ్మద్ సలీం, ఆరీఫ్, రాజేందర్, వేణు, సల్మాన్ తదితరులున్నారు.

మహాయాగ మహోత్సవాలు



శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోనీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట శ్రీ వైష్ణవ ఆయుత చండీ అతిరుద్ర మహా యాగం ఆదివారం వైభవంగా నిర్వహించారు. లోకకల్యాణం కోసం విశ్వశాంతి మహాయాగ మహోత్సవాలు ఈనెల 10 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆదివారం శ్రీకృష్ణజ్యోతి స్వరూపానంద సరస్వతి స్వామీజీ ఆధ్వర్యంలో యాగశాల ప్రవేశం, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి కొలతలు



కొలతలు తీసుకుంటున్న డీఈ వెంకటేశ్వర్లు

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ గ్రామంలో పెద్ద హనుమాన్ నూతన ఆలయ నిర్మాణానికి ఆదివారం మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఎండోమెంట్ డీఈ వెంకటేశ్వర్లు కొలతలు తీసుకున్నారు. ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు విన్నవించగా సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు తిరుపతిరెడ్డి, నాయకులు పాపెన్ రాజేశ్వర్, నాకిడి నవీన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా క్రీడా ప్రాంగణాలు



పై చిత్రంలో కనిపిస్తున్నది వద్యాల్ గ్రామంలోని క్రీడా ప్రాంగణం. దీనిని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎదురుగా ఉన్న చెరువులో ఏర్పాటు చేశారు. ఇక్కడకు వచ్చి ఎవరూ వ్యాయామం చేయకపోవడంతో క్రీడా పరికరాలు తుప్పు పడుతున్నాయి.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది మండలంలోని కనకాపూర్ తెలంగాణ క్రీడా ప్రాంగణం. దీనిని గ్రామశివారులో ఉన్న చెరువులో ఏర్పాటు చేశారు. ఊరు నుంచి కిలోమీటర్ దూరం ఉండటంతో ఇక్కడకు ఎవరూ వచ్చి వ్యాయామం చేయడం లేదు.

కింది చిత్రంలో కనిపిస్తున్న క్రీడా ప్రాంగణం మండలంలోని రాచాపూర్‌లోనిది. ఊరు శివారులో కాల్వ పక్కన ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ ప్రాంగణంలో రైతులు వరి ధాన్యం ఆరబెడుతున్నారు.



ఈ చిత్రంలో కన్పిస్తున్నది చామన్‌పెల్లిలోని క్రీడా ప్రాంగణం. ఇది గ్రామంలోని రామాలయం ఎదుట చెరువు ఒడ్డున నిర్మించారు. ఇందులో పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో అధ్వానంగా తయారైంది.



- తుప్పు పడుతున్న పరికరాలు
- వృథాగా ప్రభుత్వ ధనం
- గ్రామాల్లో అవగాహన కల్పించని అధికారులు

లక్ష్మణచాంద: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కల్గిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, యువతలో శారీరక దారుఢ్యం పెంచేందుకు గత ప్రభుత్వం ఉపాధిహామీ పథకం నిధులతో పంచాయతీకో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసింది. కానీ అధికారులు వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో అందులోని క్రీడా పరికరాలు తుప్పు పడుతున్నాయి. వ్యాయామం చేసేందుకు అటువైపు ఎవరూ వెళ్లకపోవడంతో క్రీడాప్రాంగణాలు అలంకారప్రాయంగా మారుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు వ్యాయామం, క్రీడలతో కలిగే లాభాలను గ్రామాల్లో వివరించి.. వాటిని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఒక్కో ప్రాంగణంలో..

ఒక్కో పంచాయతీకో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేసి.. ఆటలు ఆడేందుకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, లాంగ్‌జంప్ కోర్టులను ఏర్పాటు చేశారు. వ్యాయామం చేసేందుకు ఏర్పాటు చేసిన సింగిల్ బార్, డబుల్ బార్‌తోపాటు లాంగ్‌జంప్ ఫిట్, వాలీబాల్, ఖోఖో, స్తంభాలు, ఫ్లాగింగ్ స్తంభాలు తుప్పు పడుతున్నాయి.

క్రీడా ప్రాంగణాల ఏర్పాటు సమయంలో వ్యాయామం, ఆటలు ఆడితే కలిగే ప్రయోజనాలపై అధికారులు అవగాహన కల్పించారు. పోటీలు కూడా నిర్వహించారు. తర్వాత పట్టించుకోవడం మానేశారు. దీంతో యువతను శారీరకంగా ఫిట్ మార్చేందుకు ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నేడు క్రీడాకారులు లేక వెలవెల బోతున్నాయని మండల ప్రజలు అంటున్నారు.

క్రీడా ప్రాంగణాల కోసం చేసిన ఖర్చుల వివరాలు..

గ్రామం పేరు	ఖర్చుచేసిన నిధులు
1. లక్ష్మణచాంద	రూ.83 వేలు
2. చింతల్‌చాంద	రూ.25 వేలు
3. చామన్‌పెల్లి	రూ.59 వేలు
4. మునిపెల్లి	రూ.24 వేలు
5. మల్లాపూర్(మాచాపూర్)	రూ.91 వేలు
6. పార్‌పెల్లి(తండా)	రూ.1.27లక్షలు
7. ధర్మారం	రూ.64 వేలు
8. పీచర	రూ.28 వేలు
09. పొట్టపెల్లి(కే)	రూ.25 వేలు
10. రాచాపూర్	రూ.25 వేలు
11. వద్యాల్	రూ.26 వేలు
12. వద్యాల్‌తండా	రూ.29 వేలు
13. కనకాపూర్	రూ.23 వేలు
14. బాబాపూర్	రూ.25 వేలు
15. బోరిగం(ఒడ్డెపెల్లి)	రూ.1.30 లక్షలు
16. తిర్పెల్లి	రూ.21 వేలు
17. నర్సాపూర్	రూ.32 వేలు
18. న్యూకంజర్	రూ.32 వేలు

కన్నెత్తి చూడటం లేదు



అధికారులు అవగాహన కల్పించకపోవడంతో యువకులు క్రీడా ప్రాంగణాల వైపు కన్నెత్తి చూడటం లేదు. గ్రామస్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తే వీటికి ఆదరణ వస్తుంది. మా ఊరిలోని మైదానం పిచ్చిమొక్కలతో నిండి ఉంది. – చరణ్, చామన్‌పెల్లి

నిరుపయోగంగా మారాయి



క్రీడా ప్రాంగణాల నిర్వహణను పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. అధికారులు గ్రామాల్లో వ్యాయామంతో కలిగే లాభాలపై అవగాహన కల్పిస్తే యువత మళ్లీ క్రీడా మైదానం బాట పడుతారు. – మణిదీప్, యువకుడు

అవగాహన కల్పిస్తాం

గ్రామాల్లోని యువకులకు వ్యాయామం, క్రీడా పోటీలతో కలిగే లాభాలను వివరిస్తాం. త్వరలో యువతకు వివిధ రకాల పోటీలు నిర్వహించి క్రీడలపై ఆసక్తి కలిగేలా చర్యలు తీసుకుంటాం. – రాధ ఎంపీడీవో, లక్ష్మణచాంద

గజ్జలమ్మ ఆలయంలో పూజలు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో ఆది వారం భక్తులు పూజలు నిర్వహించారు. మండలంలోని రైతులు కొత్తవడ్లతో బోనం వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

రైస్‌మిల్లు ప్రారంభించిన ఎమ్మెల్యే



రైస్‌మిల్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచాంద: మండలంలోని నర్సాపూర్‌లో నూతన రైస్‌మిల్లును ఆదివారం నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ గౌడ్, అడ్వాల రమేశ్, సరికెల గంగన్న, అయిండ్ల భూపాల్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, బన్నెబోయిన పోశెట్టి, నిర్వాహకులు, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం

ఖానాపూర్: పట్టణ పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. పట్టణంలోని ఆరోవార్డు పరిధి బర్కత్‌పురలో ఆదివారం నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయించారు. స్తంభాలు ప్రమాదకరంగా మారాయని కౌన్సిలర్ ఆఫ్రిన్ అమానుల్లాఖాన్, కాలనీవాసులు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన స్పందించి స్తంభం ఏర్పాటు చేయించారు. వైస్ చైర్మన్ కావలి సంతోష్, కమిషనర్ మనోహర్, జన్నారపు శంకర్, పరిమి సురేశ్, షబ్బీర్‌పాషా, జావిద్, గని తదితరులు ఉన్నారు.

చేపపిల్లలు పంపిణీ

నర్సాపూర్(జి): మత్స్యశాఖ ఆధ్వర్యంలో నర్సాపూర్(జి)లో ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల మత్స్య సహకార సంఘాలకు 4,71,750 చేపపిల్లలు పంపిణీ చేశారు. ప్రభుత్వం ఎంపిక చేసిన 22 చెరువుల్లో చేపపిల్లలను వదులనున్నట్లు మత్స్యశాఖ ఫీల్డ్ అసిస్టెంట్ గయాసొద్దీన్ తెలిపారు. ఆయన వెంట సిబ్బంది, లబ్ధిదారులు ఉన్నారు.

రాజకీయాలకు అతీతంగా సేవ చేస్తున్నాం

- సమస్యలుంటే మమ్మల్ని సంప్రదించండి
- ఎమ్మెల్యే రామారావ్ పటేల్



భైంసాలో చెక్కు అందిస్తున్న ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసాటౌన్: రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేస్తున్నామని ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో ఆదివారం సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు చెప్పుకునేందుకు తన వద్దకు వచ్చేవారి కోసం తన నివాసంలో ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. ఏ సాయం కావాలన్నా.. తమ వ్యక్తిగత సహాయకులు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 800 మందికి వరకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందించామని.. తాజాగా మరో 215 మందికి రూ.55లక్షల విలువైన చెక్కులను అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు మల్లేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్, సుమన్, చిన్నారెడ్డి, సాయినాథ్, భూమేశ్, వెంగల్‌రావ్, రాకేశ్, సుష్మారెడ్డి, తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

లోకేశ్వరం: మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన ముత్యంకు రూ.33వేలు, భారతికి రూ. 43,500, అఖిల్‌కు రూ.27వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయయ్యాయి. ఆదివారం భైంసా పట్టణంలోని తన నివాసంలో ఎమ్మెల్యే లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. బీజేపీ నాయకులు సుమన్‌కుమార్, సరస్వతి ఉన్నారు.

నేటి నుంచి వార్షిక ఉత్సవాలు

- ముస్తాబైన వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం



వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం

ఖానాపూర్: పట్టణంలోని కుమురం భీం చౌరస్తాలో ఉన్న శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ తృతీయ వార్షిక ఉత్సవాలు ఈనెల 11 నుంచి 12 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11న మూల విరాట్ విగ్రహానికి పంచామృతాభిషేకం, పతకావిష్కరణ, గణపతిపూజ, పుణ్యాహవచనం, యజ్ఞోపవీత ధారణ, యజ్ఞశాల ప్రవేశం, తదితర పూజలతో పాటు ఆలయం నుంచి గోదావరి వరకు ఉత్సవమూర్తుల ఊరేగింపు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించనున్నారు. 12న వేదపారాయణం, పంచామృతాభిషేకం, మండప పూజ, జయాది హోమం, పూర్ణాహుతితోపాటు శ్రీ గోవిందమాంబ సమేత శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాముల కల్యాణ మహోత్సవం, కుంభాభిషేకం, అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

పకడ్బందీగా వివరాలు నమోదు చేయండి



ఉమ్రి(కే)లో పరిశీలిస్తున్న తహసీల్దార్ లింగంమూర్తి

తానూరు : మండలంలోని ఆయా గ్రామాల్లో చేపడుతున్న సమగ్ర ఇంటింట సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహశీల్దార్ లింగంమూర్తి సూచించారు.ఆదివారం మండలంలోని ఉమ్రి(కే) గ్రామంలో చేపడుతున్న సర్వేను ఆయన పరిశీలించారు.ప్రతి ఒక్కరు సర్వే సిబ్బందికి సహకరించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.ఈయన వెంట సిబ్బంది తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఆదివారం మండల ప్రత్యేకాధికారి అంజిప్రసాద్ పరిశీలించారు. గ్రామస్తులు ఎన్యూమరేటర్లకు సహకరించాలని సూచించారు. వారి వెంట ఎంపీఓ తిరుపతిరెడ్డి ఉన్నారు.

జయంతి వేడుకలకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

ఖానాపూర్: పట్టణంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఈనెల 11న నిర్వహించే తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడులకు హాజరుకావాలని కోరుతూ తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు ఆహ్వానం అందజేశారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. ఉపాధ్యాయులు రమేశ్, పర్వేజ్, నాయకులు షబ్బీర్‌పాషా, జన్నారపు శంకర్ తదితరులు ఉన్నారు.

వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా కార్యదర్శిగా భాస్కర్

ఖానాపూర్: తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఖానాపూర్ మండలం దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన రాచమల్ల భాస్కర్ నియమితులయ్యారు. జిల్లాకేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో శనివారం రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్ ఆదేశాల మేరకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగన్న ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో ఖానాపూర్‌కు చెందిన భాస్కర్‌కు కార్యదర్శిగా అవకాశం కల్పించారు.

ఓటరు నమోదుకు స్పందన



రాంపూర్‌లో పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్



ఉమ్రి(కే)లో వివరాలు తెలుసుకుంటున్న సిబ్బంది

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్, తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాల్లో శని, ఆదివారాల్లో 37 మంది ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారని తహసీల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం పలు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. బీఎల్ఓలు ఉన్నారు.

తానూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాలను ఆదివారం తహసీల్దార్ లింగంమూర్తి పరిశీలించారు. రెండు రోజుల్లో 105 మంది ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. వారి వెంట ఆర్ఐ మోహన్‌సింగ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కుంటాల: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో నిర్వహించిన ఓటరు నమోదు, సవరణ కార్యక్రమానికి స్పందన లభించిందని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. 62 మంది ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారి వెంట డీటీ నరేశ్ గౌడ్, ఆర్ఐలు అడెల్లు, రాజేశ్వర్, బీఎల్‌వోలు ఉన్నారు.

ఎమ్మెల్సీకి వినతి

కడెం: మండలకేంద్రంలో మున్నూరుకాపు సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆదివారం ఖానాపూర్‌లో ఎమ్మెల్సీ దండె విఠల్‌కు కడెం మండల మున్నూరుకాపు సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. మండలంలో 1200 కుటుంబాలున్నాయని.. భవన నిర్మాణం కోసం రూ.50లక్షలు కేటాయించాలని కోరారు. ఆ సంఘ మండలాధ్యక్షుడు కట్ల సాగర్, ప్రధాన కార్యదర్శి దేశెట్టి శ్రీనివాస్, కోల శ్రీనివాస్, తాటి సంజీవ్, మాదాసు సత్తెన్న, శ్రీనివాస్ తదితరులున్నారు.

నల్లపోచమ్మ బోనాల పండుగ



బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసం

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్‌లో ఆదివారం నల్లపోచమ్మ బోనాల పండుగ మహోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు పెద్దఎత్తున బోనాలతో వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అంతకుముందు భక్తులు ఊరేగింపు రాగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఆది వారం నిర్వహించిన వైద్యశిబిరానికి ప్రజలు తరలివచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో డిప్యూటీ స్పీకర్ అయిండ్ల భీమ్‌రెడ్డి స్మారకార్థం ఆదిత్య ఆసుపత్రి, గైనకాలజిస్టు స్వర్ణారెడ్డి ఆధ్వర్యంలో 865 మంది గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించారు. రక్తనమూనాల పరీక్షలు, ఈసీజీ, 2డీఈకో వంటి రూ.3 లక్షల విలువైన పరీక్షలు నిర్వహించి.. రూ.8లక్షల విలువైన మందులను అందించినట్లు వైద్యురాలు స్వర్ణారెడ్డి తెలిపారు. మల్లాపూర్, మాచాపూర్ గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. కార్యక్రమంలో నాయకులు అయిండ్ల భూపాల్‌రెడ్డి, అడ్వాల రమేశ్, సయ్యద్, అనిల్, లింగారెడ్డి, వైద్యులు ప్రమోద్‌చంద్రారెడ్డి, శశాంక్‌రెడ్డి, మానస, వసుకుమార్, కిరణ్, అన్వేష్, గిరీశ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

కుంటాల: ఇటీవల డీఎస్సీ–24లో ఉపాధ్యాయులుగా మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన పసుల సాయికిరణ్, ప్రశాంత్,పెంట సంపత్, లోకసృజన, కొప్పెల విశాల ఎంపికయ్యారు. ఆదివారం నూతన ఉపాధ్యాయులను కల్లూరులో వీడీసీ సభ్యులు సన్మానించి అభినందించారు. వీడీసీ చైర్మన్ పసుల సాయన్న, ఉపాధ్యక్షుడు జీవన్, కోశాధికారి ప్యాట్ల రజనీకాంత్, రమణగౌడ్, సభ్యులు సాయిరాం, దిగంబర్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

తానూరు: మండల కేంద్రంలోని మార్కండేయస్వామి ఆలయంలో ఆదివారం ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన పద్మశాలీలను మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ట్రిపుల్ఐటీ ప్రొఫెసర్ రావుల శ్రీకాంత్, మండలాధ్యక్షుడు రచ్చ భూమన్న, గౌరవాధ్యక్షుడు అనమ్ పోశెట్టి, నర్సయ్య, సంతోష్, సాయి, అశోక్ పాల్గొన్నారు.

ఊతమిస్తేనే.. పొలం కోసేది



విద్యుత్ తీగలను కర్రతో పైకి ఎత్తుతున్న రైతు

లక్ష్మణచాంద: వేలడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలని కోరినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఆదివారం మండలంలోని పొట్టపెల్లి(కే)లో పోతుగంటి రవీందర్ తన వరిపొలాన్ని హార్వెస్టర్‌తో కోయించాడు. వరికోత సమయంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు వాహనానికి తగలకుండా సదరు రైతు కర్రతో ఇలా పైకి లేపి పట్టుకున్నాడు.